
డిటెక్టివ్ స్టోరీ

# హాం ఫట్!

- వి.యస్.రావ్



''నమస్తే, మిస్టర్ టెంపో! దయచేయండి!'' కుర్చీలోంచీ లేస్తూ ఆహ్వానించాడు గుప్తా; ఠీవిగా వస్తున్న డిటెక్టివ్ టెంపోని చూస్తూ.

''నమస్తే...'' డిటెక్టివ్ టెంపో చిరునవ్వుతో అంటూ, నీరసంగా సోఫాలో కూలబడిన వరహాల గుప్తాను ఆశ్చర్యంగా చూశాడు.

గుప్తా మౌనంగా టెంపోకి సోఫా చూపించాడు. డాక్టర్ని పిలవబోయి, పొరపాటుగా తనను పిలిచాడా గుప్తా? అనుకుంటూ కూచున్నాడు డిటెక్టివ్ టెంపో.

''నీరసంగా  ఉన్నారు?''

టెంపో ప్రశ్న విని, పొగ ఊదే గొట్టంలా చప్పుడు చేస్తూ నిట్టూర్చాడు; గుప్తా.

''రాత్రి నుంచీ పచ్చి మంచినీళ్ళు ముట్టలేదు! కళ్ళు తిరుగుతున్నాయి; ఒళ్ళు తూలుతోంది....'' గుప్తా నీరసంగా అన్నాడు.

''డాక్టర్ని పిలవక పోయారా?''

''ఈ రోగానికి మందు డాక్టర్లివ్వలేరు! మీరివ్వాల్సిందే!'' గుప్తా బల వంతంగా నవ్వుతూ అన్నాడు. ''ఘోరం జరిగిపోయింది, టెంపో గారూ?''

''ఎన్ని నగలు? ఎంత నష్టం?'' డిటెక్టివ్ టెంపో అడిగాడు.

''టెంపో గారూ!'' గుప్తా ఆశ్చర్యంతో అన్నాడు. ''జరిగిందంతా అతి రహస్యంగా వుంచాం! ఎలా కనిపెట్టారు!''

డిటెక్టివ్ టెంపో సిగరెట్ ముట్టించి, పొగ ఊది, చిరునవ్వు నవ్వుతూ చూశాడు.

''మీరు సిటీలో ఫేమస్ జ్యుయలర్స్! మీ దృష్టిలో 'ఘోరం' అంటే ఏమిటో ఊహించడం కష్టం కాదు! విషయం చెప్పండి!''

''మీ తర్కం దాదాపు నిజమే! పోయింది నగ కాదు; నగదూ కాదు!'' గుప్తా విచారంగా అన్నాడు. ''ఇవాళ లక్షలూ, రేపు కోట్లూ విలువచేసే రేర్ డైమండ్! ఆ డైమండ్ ఎక్కడుందో కనిపెట్టండీ; అమ్మకానికి పెట్టించిందీ, ధర నిర్ణయించిందీ, ముగ్గురు పార్టనర్స్‌నీ వొప్పించిందీ నేనే! చివరికి నిన్న అమ్మిన సొంతదారుకి సొమ్ము చెల్లించి ఆ సరుకును స్వాధీనం చేసుకుందీ, జాగర్తగా దాచిందీ నేనే!''

''అంటే దాని జవాబుదారీ పూర్తిగా మీదే అన్న మాట!'' డిటెక్టివ్ టెంపో సాలోచనగా అన్నాడు.

''ఉన్నమాట కూడా అదే! నా ఇంట్లో, నా గదిలో – ఆ టేబుల్ మీద నుంచీ అది అకస్మాత్తుగా అంతర్ధానమై పోయింది!'' గుప్తా వివరిస్తూ అన్నాడు.

''నేపాల్ నుంచీ వచ్చిన వ్యక్తికి డబ్బు చెల్లించి, డైమండ్‌ని అదిగో, ఆ సేఫ్‌లో సేఫ్‌గా దాచాను. చారి, భిక్షపతి, అగర్‌వాల్ – ఈ ముగ్గురికీ  ఫోన్ చేసి చెప్పాను. ఆ ముగ్గురూ నా పార్టనర్స్. రాత్రి ఎనిమిదింటికి అందరం యిలా గదిలో – అదిగో ఆ టేబుల్ చుట్టూవున్న కుర్చీల్లో కూచున్నాం. వాళ్ళకి చూపించడం కోసం డైమండ్‌ని ఇనప్పెట్టెలోంచీ తీశాను. చిన్నబాక్సు తెరిచి, టేబుల్‌మీద పెట్టాను. సాధారణంగా రత్నపరీక్ష చేసే సమయాల్లో టేబుల్ లాంప్‌ని వెలిగించడానికి స్విచ్ నొక్కాను. టేబుల్ లైట్ వెలగడానికి బదులు గదిలోని లైట్లన్నీ ఆరిపోయాయి! కటిక చీకట్లో కాసేపు కంగారుపడిపోయాం! కొవ్వొత్తుల కోసం ఎవరో అరిచారు. నౌఖరు లింగయ్య కొవ్వొత్తులు తెచ్చాడు. కొవ్వొత్తులు వెలిగించి చూసే సరికి – డైమండ్ మాయమైంది....''

''ఇదంతా జరిగిన సమయంలో గదిలో ఎవరెవరున్నారో చెప్పండి!''

''చారీ, భిక్షపతీ, అగర్వాలూ, నేనూ – అంతే! నేపాల్ డైమండ్ వ్యవహారం టాప్ సీక్రెట్! అమ్మిన నేపాలీకీ, మా నలుగురికీ తప్పా – మరెవ్వరికీ – చివరికి నా భార్యకు కూడా తెలీదు! అది సీక్రెట్ డీల్! అందుకే పోలీసులకి చెప్పే అవకాశం లేక, మిమ్మల్ని

ఆశ్రయించాను!''

''మిస్టర్ గుప్తా! మీ ఇంట్లో ఎవరెవరున్నారు!'' టెంపో ప్రశ్నించాడు.

''నేనూ, మా ఆవిడా, వంట మనిషీ, నౌఖరూ, రాత్రీ పగలూ ఇంట్లో వుండే వాళ్ళు మేమే! డ్రైవర్ పనవగానే వెళ్ళిపోతాడు''.


''లైట్స్ ఎందుకు ఆరిపోయాయో చెక్ చేయించారా?''

''చేయించాను. ఈ గదీ, పక్కనున్న బెడ్‌రూమ్, చివరున్న స్టోర్ రూం – ఇవన్నీ ఒకే సర్క్యూట్‌లో వున్నాయి. మెట్ల కింది ఫ్యూజ్ బాక్సుంది. ఈ సర్క్యూట్‌కి సంబంధించిన ఫ్యూజ్‌వైర్ మాడిపోయి వుంది. లైట్లు ఆరి పోవడానికి కారణం ఆ ఫ్యూజ్ పోవడమే అన్నాడు ఎలక్ట్రీషియన్..''

డిటెక్టివ్ టెంపో సోఫాలోంచీ లేచి, ఏదో ఆలోచిస్తూ గదంతా కలియ తిరుగుతున్నాడు. గుప్తా తల టెంపో ఎటు తిరిగితే అటు తిరుగుతోంది. డిటెక్టివ్ టెంపో టేబుల్‌వద్ద ఆగి, టేబుల్‌లైట్‌ని చూస్తూ వుండి పోయాడు. గిరుక్కున వెనక్కి తిరిగి గుప్తా వైపు చూశాడు. ''మిస్టర్ గుప్తా! షార్ట్ సర్క్యూట్ వల్ల టేబిల్ లైట్ ఆరిపోయింది. షార్ట్ సర్క్యూట్ ఎందుకైంది?''

''ఫ్యూజ్ మాడిపోయిందిగా!''

డిటెక్టివ్ టెంపో మాట్లాడకుండా టేబుల్‌కి ఆనుకుని, వాలుగా నిలబడాడు. కోటు జేబులోంచీ ప్యాకెట్ తీసి 'స్టేట్ ఎక్స్‌ప్రెస్'ని వెలిగించాడు. ఆలోచిస్తున్న అతని చేతిలోంచీ జారి అగ్గిపెట్టె కింద పడింది. టెంపో కిందికి వంగి అగ్గిపెట్టెను అందుకుని, కోటు జేబులో వేసుకున్నాడు.



''మిస్టర్ గుప్తా.... లైట్ ఆరిపోయి, ఏర్పాటుచేసిన చీకట్లో – మీ నలుగురిలో ఎవరో ఒకరు డైమండ్‌ని తీసి వుండొచ్చుగా!'' టెంపో వున్నట్టుండి ప్రశ్నించాడు.

గుప్తా ముఖం మీద బలహీనమైన చిరునవ్వు ప్రత్యక్షమైంది. ''అది – వజ్రం మాయమైన విషయం వెల్లడైన మరుక్షణం మా నలుగురిలోనూ ఉత్పన్నమైన మొట్టమొదటి ఆలోచనా, అనుమానం – అదే! మా పార్టనర్స్ నలుగురి మధ్య, చలనచిత్ర నిర్మాతలు నాగిరెడ్డి-చక్రపాణిల మధ్య

వున్నంత అవగాహన, విశ్వాసం వున్నాయి. ఒకర్ని ముగ్గురు చొప్పున, నలుగుర్నీ నలుగురు - క్షుణ్ణంగా సోదా చేసేసుకున్నాం! కాజేసిన వజ్రాల్ని దొంగలు ఎక్కడ, ఎలా దాచుకుంటారో మాకు బాగా తెలుసు! దుస్తుల్లో, దుస్తులు తీసిపారేసి, శరీ రావయవ భాగాల్లో చక్కగా వెతికాం!''

''మీ నలుగురూ వజ్రాన్ని కాజేయలేదు! గది లోకి ఇంకెవరూ రాలేదు! డైమండ్ కరిగి గాలిలో కలిసిపోయిందా?'' డిటెక్టివ్ టెంపో ప్రశ్నించాడు.

''అది ఏమైందో కనిపెట్టడానికే మీ సహాయం అడుగుతున్నాను!''

''మిస్టర్ గుప్తా! నేను మీ వంట మనిషినీ, నౌఖర్నీ, డ్రైవర్నీ ప్రశ్నించాలి... ఏకాంతంలో?'' డిటెక్టివ్ టెంపో సాలోచనగా అన్నాడు.

''నా డ్రాయింగ్ రూంలోకి ఒక్కొక్కరే వచ్చే ఏర్పాటుచేస్తాను'' అంటూ గుప్తా పైకి లేచాడు.

***

డిటెక్టివ్ టెంపో తన గదిలో పచార్లు చేస్తు న్నాడు. అతని బుర్రలో ఆలోచనలు గందరగో ళంగా సాగుతున్నాయి...



గుప్తా, చారీ, భిక్షపతీ, అగర్వాల్ - పార్టనర్స్ నలుగురూ మంచివాళ్ళే! నేపాల్ డైమండ్‌ని ఆ నలు గురూ కాజేయలేదు! గదిలో వాళ్ళు తప్పా, ఇతర్లె వరూ లేరు! ఎవ్వరూ రాలేదు! లైట్లు ఆరిపోయేక, కొవ్వొత్తులు తీసుకు రమ్మన్న కేక విని నౌకరొచ్చాడు గదిలోకి! అయితే నౌఖరు గుమ్మం దగ్గరే నిలుచుని కొవ్వొత్తుల్ని అగర్వాల్‌కి అందించాడు. అందించిన వెంటనే గదిలోంచీ వెళ్ళిపోయాడు?

అంటే నౌఖరు లింగయ్య డైమండ్‌ని తీసుకో లేదు!

నౌఖరు కాకుండా మరెవరూ గదిలోకి రాలేదు...

ఎవరేనా వస్తేగానీ, తీసుకుంటే గానీ - డైమండ్ మాయం కాదు!

డిటెక్టివ్ టెంపో తీవ్రంగా ఆలోచిస్తూ జేబు లోంచీ సిగరెట్ పెట్టె తీశాడు. సిగరెట్‌ని ఇవతలికి లాగి, టిప్‌ని పెట్టెమీద కొట్టుతూ వుండిపోయాడు. ఆలోచన అతడి కనుబొమ్మల్ని మధ్యలో కలిపింది.

గదిలోపలికి ఎవరో - అయిదో వ్యక్తి వస్తేగానీ, డైమండ్ మాయం కాదు...

గదిలోంచీ ఎవరో - అయిదో వ్యక్తి బైటికి వెళ్తే?!

డిటెక్టివ్ టెంపో ఆలోచనలో కూరుకుపోతూ కళ్లు చిట్లించాడు. డైమండ్‌ని గదిలోనికి వచ్చిన వ్యక్తే కాజేయగలడా? గది లోంచీ బైటికి వెళ్ళే వ్యక్తి కాజేయ లేడా? ఎందుకు కాజేయలేడు? కాజేయగలడు!

ఆలోచన సరైన మార్గంలో పడ్డందుకు లోపల్లోపలే నవ్వు కుంటూ, అగ్గిపెట్టె కోసం కోటు జేబులో చెయ్యిపెట్టాడు టెంపో. వేళ్ళకి, అగ్గిపెట్టెతో బాటు - చల్లగా, గుండ్రంగా ఏదో తగు ల్తోంది. టెంపో చెయ్యి ఇవతలికి వచ్చింది. అరచేతిలో ప్రత్యక్షమైన 'రాగి కానీ'ని ఆశ్చర్యంగా చూశా డతను. గుప్తా గదిలో టేబుల్ దగ్గరగా పడి, తనకి కనిపించిన కానీ! దాని గురించి మరిచే పోయాడు తను, వేరే ఆలోచ నల్తో! నేలమీద పడి వున్న కానీనీ చూసి, కావాలని అగ్గిపెట్టెను దానిమీదికి జారవిడిచి, అగ్గిపె ట్టెతో బాటు జేబులో పడేసుకు న్నాడు తను, ఆ పాత నాణేన్ని!

డిటెక్టివ్ టెంపో ఆవేశంతో సిగరెట్ వెలిగించాడు. టేబుల్ వెనకున్న రొటేటింగ్ చెయిర్లో కూచుని, 'బొమ్మా, బొరుసు' అనుకుంటూ 'రాగి కానీ'ని బొట నవేలితో ఎగజిమ్మాడు. పల్టీలుకొ డుతూ కిందికి దూసు కొస్తున్న నాణేన్ని టెంపో అరచెయ్యి ఆపింది. బొమ్మ! బ్రిటిష్ చక్రవర్తి తల. కనిపించేలా నాణేన్నా టేబుల్ మీద పెట్టి, రిసీవర్ అందుకుని ఒక నంబర్ డయల్ చేశాడు,టెంపో.

''నిన్న, నేడు, రేపు' దినపత్రిక సంపాదకుడు సత్యమూర్తి..'' అవతలి కంఠం మెల్లగా అంది.

''సత్యం... టెంపో!''

''నమస్తే బాస్! అట్ యువర్ సర్వీస్! ఏం కావాలి?''

''బలే పసిగట్టావే! ఈ ఏడాది ప్రారంభంలో అనుకుంటాను. ఆదివారం అనుబంధంలో ఒక ఆర్టి కల్ - ఫొటోలతో సహా వేశావు... క్యాప్షన్ 'పాత నాణేల పాదుషా!' అనుకుంటాను..''

''ఔను... పాత నాణేలు కావాలా?'' సత్యమూర్తి అడ్డు తగిలాడు.

''పాదుషా వివరాలు కావాలి! ఊరు, పేరూ, వృత్తీ ఉద్యోగం...''

''అయిదు నిమిషాలిస్తావా?''

''ఇచ్చేశాను!'' అంటూ టెంపో రిసీవర్ని పడే శాడు. అతని చూపుని అయస్కాంతంలా లాగు తోంది పాతనాణెం.... 1956 తర్వాత - చెలామణీ చెల్లిపోయిన కానీ! 'అణా' అదే నాణెంలో నాలుగో వంతు! రూపాయిలో అరవై నాలుగో వంతు!

డిటెక్టివ్ టెంపో ఆలోచనల్ని తెంచేస్తూ ఫోన్ రింగైంది.

''యస్!'' అన్నాడు టెంపో, రిసీవర్ని చెవికి ఆనించి.

''బాసూ... సత్యమూర్తిని... 'పాత నాణేల పాదుషా' ఊరు-ఇదే. పేరు..'' సత్యమూర్తి చకచకా అప్పజెప్పున్నాడు. టెంపో ఆశ్చర్యంతో వినసాగేడు.

''ఆ వ్యక్తి ఫోన్నంబరుందా?'' అంతా విన్న డిటె క్టివ్ టెంపో ప్రశ్నించాడు.

''ఉందిగా! పాత నాణేలు అమ్మదలచిన వాళ్ళకి తన నంబరు ఇచ్చారుగా! రాసుకుంటావా?'' సత్య మూర్తి అడిగాడు.

''బుర్రలో రాసుకుంటాను; చెప్పు!''

సత్యమూర్తి మొబైల్ నంబరు చెప్పాడు. డిటెక్టివ్ టెంపో బుర్రలో రాసుకున్నాడు. ఆలోచిస్తూ సిగ రెట్ వెలిగించాడు. 'నిన్న-నేడు-రేపు' దిన పత్రిక ఆదివారం అనుబంధంలో ఎప్పుడో చూసిన పాత నాణేల పాదుషా ముఖం గుర్తొస్తోంది టెంపోకి.

డిటెక్టివ్ టెంపో సాలోచనగా జేబులోంచీ మొబైల్ చేసి, డయల్ చేశాడు.

''క్రైమ్ బ్రాంచ్ - ఇన్స్‌పెక్టర్ పృథ్వీరావ్!'' అంది అవతలికంఠం, టెంపో చెవిలో.

''పృథ్వీ! అర్జెంటుగా చిన్నసాయం కావాలి... ఒక మొబైల్ నంబరిస్తాను. నిన్న రాత్రి ఎనిమిదింటి దాకా ఆ నంబరుకి ఏయే నంబర్లనుండీ కాల్స్ వచ్చాయో! ఆ వ్యక్తులెవరో కావాలి!''

''గురూ! గడ్డి వాములో సూదిని వెదకమంటు న్నావ్!''

''సూదిని వెతకమని ఎవర్ని అడుగుతున్నానో తెల్సా?'' టెంపో నవ్వాడు.

''ఎవర్ని?'' నవ్వుతో శృతి కలుపుతూ అడిగాడు

పృథ్వీరావ్.

''సూదంటు రాయిని!''

***

''మిస్టర్ గుప్తా!'' మొబైల్‌లోకి అన్నాడు టెంపో.

''యస్..''

''టెంపో స్పీకింగ్... మీ డైమండ్ దొంగ దొరికాడు..''

''వాట్?! నిజంగా?!'' గుప్తా అరిచాడు. ''ఎవడు? ఎవడు వాడు? టెంపో గారూ?''

''రాత్రి ఏడున్నరకి అక్కడికొస్తాను. అప్పుడు చెప్తాను! మీ భాగస్వాములు ముగ్గురూ ఏడు యాభైకి మీ గదిలో హాజరుకావాలి...''

''మిస్టర్ టెంపో... వాళ్ళెందుకు?''

''సారీ. మీరు వేసే యే ప్రశ్నకీ ఇప్పుడు సమాధానం చెప్పను!'' టెంపో సీరియస్‌గా అన్నాడు. ఈ రాత్రి కార్యక్రమం గురించి మీ పార్టనర్స్‌కి స్వయంగా నేనే చెప్తాను. వాళ్ళ మొబైల్ ఫోన్ల నంబర్లివ్వండి!''

''చారి నంబరు రాసుకోండి..'' అంటూ చెప్పడం ప్రారంభించాడు గుప్తా.

***

''మిస్టర్ చారీ... డిటెక్టివ్ టెంపోని మాట్లాడుతున్నాను. వజ్రాన్నీ, దొంగనీ వెతికి పట్టుకునే పని నాకు అప్పగించారు మీ పార్టనర్....''

''యస్ మిస్టర్ టెంపో! గుప్తా చెప్పాడు!'' అటు వైపునుంచి చారి ఉషారుగా అన్నాడు.

''దొంగ దొరికాడు! రాత్రి ఏడు యాభైకి మనం దరం గుప్తాగారి గదిలో సమావేశమవుతున్నాం. ఆలస్యంగా వచ్చినా, అస్సలు రాకపోయినా దొంగ ఎవరో, దొంగిలించబడిన వస్తువు ఎక్కడుందో చెప్పను!''

''మిస్టర్ టెంపో! దొంగ ఎవడు?''

''ఏడు యాభై! గుప్తా గారి గది!'' అంటూ స్విచ్ ఆఫ్ చేశాడు టెంపో.

బిక్షపతికీ, అగర్వాల్‌కీ అలాగే శుభవార్త అందచేశాడు టెంపో.

***

టెంపో రెండు సోఫాల్లో కూచున్న పార్టనర్స్ నలుగుర్నీ డిటెక్టివ్ టెంపో కలియజూశాడు. అందరి మొహాల్లోనూ ఉత్కంఠ ప్రతిఫలిస్తోంది.

''జెంటిల్‌మెన్! అమూల్యమైన నేపాలీ డైమండ్‌ని కాజేసిన దొంగని నేను కనిపెట్టేశానని చెప్పడానికి ఆనందిస్తున్నాను. విచిత్రమైన విషయం ఏమిటంటే, ఆ వజ్రం దొంగ ఈ ఇంట్లోనే వున్నాడు! దొంతగనం జరగకుండా వుండి వుంటే, నా జోక్యం లేకుండా వుండి వుంటే - యీ సంఘటన పోలీసుల దాకా వెళ్ళేది కాదు! నా మిత్రుడు క్రైం బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ పృథ్వీరావ్ దొంగని కస్టడీలోకి తీసుకోడానికి రెడీగా వున్నాడు.

''ఇంతకీ దొంగ..'' గుప్తా ప్రారంభించాడు.

''ఎవరో చెప్పేముందు ఒక చిన్నప్రయోగం చేస్తున్నాను. మీరు నలుగురూ - ఆ టేబుల్ చుట్టూ, నిన్న రాత్రి ఏయే కుర్చీల్లో, ఏ వరసలో కూచున్నారో అలాగే కూచోండి!'' టెంపో నలుగుర్నీ చూస్తూ అన్నాడు.

ఆశ్చర్యానికి పట్టిన అద్దాల్లా వున్న కళ్ళతో టెంపోని చూస్తూ నలుగురూ కుర్చీల్లో కూచున్నారు. 'ఇప్పుడేం చేయాలి?' అన్నట్టు నలుగురూ టెంపో వైపు చూశారు.

''గుప్తా గారూ! నిన్న వజ్రం వున్న చిన్న బాక్సుని ఇనప్పెట్టెలోంచీ తీసి, టేబుల్ మీద పెట్టారు...''

''అవును...''

''ఇప్పుడు అలాగే - వజ్రం లేని ఖాళీ బాక్సు ఇనప్పెట్టెలోంచీ తీసి, టేబుల్ మీద పెట్టండి!''

''మిస్టర్ టెంపో... వృథా కాలయాపన దేనికి? దొంగ ఎవరో...''

''మిస్టర్ గుప్తా! డూ యాజైసే! నోరు తెరవకండి! ఇనప్పెట్టె తెరవండి!'' టెంపో గద్దించినట్టు అన్నాడు.

గుప్తా లేచి, ఇనప్పెట్టె తెరిచి, చిన్నబాక్సుని టేబుల్ మీద పెట్టాడు.

''బాక్సుని పెట్టేక - నిన్న - టేబుల్ లైట్ స్విచాన్ చేశారు. అవునా?''

''ఔను...''

''ఇప్పుడూ అదే చేయండి! స్విచాన్ ద టేబుల్ లైట్!''

కొద్దిగా వణుకుతన్న చేత్తో గుప్తా స్విచ్ నొక్కాడు. తటాలున గదిలోని లైట్లన్నీ ఆరిపోయాయి! ఆ అదనుకోసం చూస్తున్న దానిలాగా కారు చీకటి గదిలో అలముకుంది. ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్న నలుగురి నోళ్ళనీ టెంపో కంఠం నొక్కేసింది. ''నిన్న కొవ్వొత్తుల కోసం కేకవేసిన వ్యక్తి ఎవరు, గుప్తా గారూ?''

''...అగర్వాల్ జీ అనుకుంటాను''.

''అగర్వాల్‌జీ! నిన్నటిలాగే కొవ్వొత్తుల కోసం అరవండి, ప్లీజ్!'' టెంపో అన్నాడు.

అగర్వాల్ కీచుగొంతక చీకట్లో ప్రతిధ్వనించింది. ''ఎవరు? ఎవరక్కడ? కొవ్వొత్తులు తీసుకురండి! అర్జెంట్!''

తలుపు తెరిచిన చప్పుడైంది. నౌఖరు లింగయ్య గుమ్మంలో నీడలా నిలుచున్నాడు.

''జెంటిల్‌మెన్! కంగారుపడకండి! కొవ్వొత్తుల్ని నేను వెలిగిస్తాను!'' అన్నాడు టెంపో నౌఖరు వైపు అడుగులేస్తూ.

టెంపో కోటు జేబులోంచీ అగ్గిపెట్టె తీశాడు. అతని బొటన వేలు అగ్గిపెట్టె సొరుగును నెట్టింది. సొరుగు పెట్టెలోంచీ జారి, కిందపడిపోతూ చిన్నగా చప్పుడు చేసింది.

''సారీ... ఒక్క క్షణం... పుల్లలన్నీ కిందపడిపోయాయి...'' అంటూ టెంపో కింద కూచుని అరచేత్తో తడిమాడు. ఒక పుల్లను తీసుకుని గీచి, మెల్లగా లేచాడు. అర చెయ్యి అడ్డు పెట్టుకుని, అగ్గిపుల్ల మంటను కాపాడుతూ నౌఖరు దగ్గరగా నడిచాడు. కాసేపట్లో రెండు కొవ్వొత్తుల జంట వెలుగు చీకటితో యుద్ధం చేయడం ప్రారంభించింది.

నౌఖరు చేతుల్లోంచీ కొవ్వొత్తుల్ని అందుకుని



## వ్యక్తిగత జీవితం ఉండదా?

సినీ విమర్శకులకి గ్లామర్‌కి, సెక్సీకి తేడా లేకుండా పోతోందంటూ కమల్‌హాసన్ కుమార్తె శృతీ హాసన్ తన అక్కసంతా వెళ్ళగక్కుతోంది. ''ఈ ఫీల్డ్‌లో గ్లామర్‌గా కనిపించడం తప్పనిసరి, దానికి కూడా పెడార్థాలు తీస్తే ఎలా'' అంటూ శృతి ఆవేదన వ్యక్తం చేస్తోంది. ''ఏ హీరోతో కాస్త నవ్వుతూ మాట్లాడినా, అతగాడితో కలిసి నైట్ పార్టీలకు వెళ్ళినా వెంటనే సంబంధాలు అంటగడుతున్నారు. హీరోయిన్లకు వ్యక్తిగత జీవితం ఉండనక్కర్లేదా?'' అంటూ ఆవేశంగా ప్రశ్నిస్తోంది. శృతి హాసన్ ఆవేదన అర్థం లేనిదనీ, 'గుమ్మడికాయల దొంగ ఎవరంటే భుజాలు తడుముకొన్నట్లుందని' పలువురు అంటున్నారు.

టెంపో టేబిల్‌వైపు నడిచాడు. కొవ్వొత్తుల్నీ టేబుల్ మధ్యలో నిలబెట్టాడు. మరుక్షణం అందరి కళ్ళు జిగేల్ మన్నాయి! బాక్స్‌లో ధగధగమెరుస్తూ వెలుగు కిరణాల్ని వెదజల్లు తోంది వజ్రం!

''వజ్రం!!'' నాలుగు కంఠాలు ఒకేసారి అరిచాయి.

''మిస్టర్ గుప్తా, చీకట్లో అంతర్ధానమైన నేపాలీ వజ్రం చీకట్లోనే ప్రత్యక్షమైంది! తీసి జాగ్రత్త చేయండి!'' టెంపో నవ్వుతూ అన్నాడు.

''టెంపో గారూ! మీకు శతకోటి ధన్యవాదాలు!'' గుప్తా ఆవేశంగా అన్నాడు.

''యస్! మన కంపెనీ తరపున టెంపోగారికి లక్ష రూపాయల పారితోషికం ఇద్దాం!'' అగర్వాల్ ప్రతిపాదించాడు.

''యస్! ఇద్దాం!'' చారీ, భిక్షపతీ ఏకకంఠంతో అన్నారు.

''థాంక్యూ!'' టెంపో నవ్వాడు.

''టెంపోగారూ... ఇంతకూ దొంగ ఎవరో, ఎలా కనిపెట్టారో...''

టెంపో చిన్నగా నవ్వాడు. ''దొంగ - మీ నలుగురిలోనే ఉన్నాడు. ఆ దొంగకి ఒక తోడు దొంగ కూడా వున్నాడు. చెప్పమంటారా?''

''మా నలుగురిలో ఒకడు వజ్రాన్ని కాజేశాడ

న్నది అబ్సర్డ్! మీనింగ్ లెస్ అండ్ ఔట్ రేజియస్!' బిక్షపతి ఆవేశంగా అరిచాడు.

"పోయిన డైమండ్ దొరికింది! ఇంక దొంగతో పనేముంది! లెట్స్ ఫర్గెట్!" అగర్వాల్ పైకిలేస్తూ అన్నాడు.

"టెంపోగారూ! దొంగ మాలో ఒకడు అనే మీ పరిశోధనా ఫలితం నిజమైనా, కేవలం అనుమానమే అయినా మాకు నలుగురికీ ఇబ్బందే! ఆ రహస్యం మీలోనే వుండి పోనివ్వండి! దొరికిన డైమండ్‌తో మేం తృప్తి పడతాం!" చారి పైకిలేస్తూ అన్నాడు.

"ఓకే.... మెజారిటీ మాటే నెగ్గాలి! లెట్స్ డిస్



# మీరే డిటెక్టివ్!?

*నిర్వహణ: అన్య*

## నెత్తుటి కాలువ

బీచ్‌లో సిమెంట్ బెంచ్‌మీద వెల్లకిలా పడున్నాడు కోస్ట్‌గార్డ్. నుదుటి మీద తాకింది బుల్లెట్. ఎడమ పక్కన నెత్తురు ధారకట్టింది.

"ఈ వుదయం డ్యూటీకి వచ్చిన అతడి కొలీగ్ చూసి మాకు సమాచారం అందించాడు. రాత్రి పన్నెండు, నాలుగు మధ్య మరణించి వుంటాడు. ఇది ఆత్మహత్య అని అనుమానం. ఇటీవల అప్పుల బాధ పెరిగిందట. నిన్న రాత్రి ఫ్రెండ్సుతో కలిసి పార్టీ కూడా చేసుకున్నాడట. తీరంలో తుఫానుగాలి తీవ్రంగా వీస్తున్నప్పుడు, మరో ఫ్రెండుతో కలిసి పదకొండున్నర ప్రాంతంలో యిక్కడి కొచ్చాడట. ఇద్దరూ కలిసి, అప్పుల గురించీ, ఆడపిల్లల గురించీ బాతాఖానీ కొట్టారట. అయితే, యింతకు తెగిస్తాడని ఎవరికీ అనుమానం రాలేదు. ఇద్దరూ కలిసి బీచ్‌లో పచార్లు చేశారు. అర్ధరాత్రి సమయం కద. అలలు వువ్వెత్తుగా ఎగిసిపడి వుంటాయి. లైట్లు కూడా వెలగలేదు. ఈ ప్రాంతమంతా చీకటిగానే వుంటుంది మరి. పైగా, ఈదురుగాలి బలంగా మొహం మీదికి వీచిందిట. మిత్రుడికి కాస్త దూరం వెళ్లగానే వెనకనుండి 'ఢాం'మ్మని శబ్దం వినిపించింది. అయితే, అతడు అప్పటికే తాగిన మత్తులో వుండడం చేత, జరిగిన ఘోరం గ్రహించలేదు. పాపం, యువకుడు. సమస్యలకు భయపడి ఆత్మహత్య చేసుకున్నాడు" అంటూ తనకు తెలిసిన సమాచారం చెప్పాడు ఇనస్పెక్టర్.

"కాని ఇది ఆత్మహత్య కాదుగా" అన్నాడు డిటెక్టివ్.

డిటెక్టివ్ కెందుకా సందేహం వచ్చింది?

**సమాధానం:** మొహం మీదికి ఈదురుగాలి వీస్తున్నప్పుడు, వ్యక్తి నుదుటిమీద కాల్చుకుంటే, నెత్తురు మొహం మీద చిల్లుతుందే గానీ ధార కట్టదు.

బర్స్!" అన్నాడు నీరసంగా గుప్తా.

***

ఇప్పుడు గదిలో లైట్లు వెలుగుతున్నాయి. గదిలో డిటెక్టివ్ టెంపో, వరహాలు గుప్తా ఇద్దరే వున్నారు.

"మిస్టర్ టెంపో... ఇదిగో లక్ష రూపాయల చెక్కు!" అంటూ గుప్తా చెక్కును టెంపోకి అందించాడు. "దొంగ ఎవరో నాకు తెలియాలి! చెప్పండి! అలాగే ఎలా కనిపెట్టారో చెప్పండి!"

"దొంగను దాచివుంచడం నాకూ ఇష్టం లేదు..." చెక్కుని జేబులోకి నెట్టుతూ అన్నాడు టెంపో. "స్విచ్ నొక్కగానే టేబుల్ లైట్‌తో సహా గదిలో లైట్లన్నీ ఆరిపోయాయి! కారణం షార్ట్ సర్క్యూట్! అందుక్కారణం – ఇదిగో – యిది!" అంటూ టేబుల్ లైట్ బల్బుని వూడదీసి, దానికీ, హోల్డర్‌కీ మధ్య ఇరికించి వున్న రాగి కానీ నాణేన్ని చూపించాడు టెంపో.

"ఇవాళ గదిలోకి రాగానే – మీరు కాఫీ ఆర్డరివ్వడానికి గుమ్మం వద్ద కెళ్ళినప్పుడు నేనే పెట్టాను!"

"ఆ కానీ మీకు.."

"నిన్న యీ గదిలోనే, టేబుల్ దగ్గరగా దొరికింది. బల్బుకీ, హోల్డర్‌కీ మధ్య ఇరికించిన ఆసామి – దొంగ – వజ్రాన్ని తీసుకున్నాక, కానీని కూడా తీసి, దాచుకోడంలో – కంగారులో – కింద పడేశాడు! అది నాకు దొరికింది!"

"టెంపోగారూ, ఎవడా దరిద్రుడు?"

"మొదట్నించీ గదిలోకి ఎవరో ఏదోవ్యక్తి వచ్చాడనీ, డైమండ్‌ని కాజేశాడనీ అనుకుంటూ వచ్చాను! సహజమైన ఆ అనుమానం తప్పు దారిలో పంపించింది, నా పరిశోధనను! గది బైటి నుండీ లోపలికి వచ్చిన వ్యక్తి కాకుండా, గది లోపల్నుండీ బైటికి వెళ్ళే వ్యక్తి వజ్రాన్ని 'హాంఫట్' చేశాడని ఊహించాను.."

"టెంపోగారూ... మీ ఆలోచన తప్పు! గదిలో మేం నలుగురమే వున్నాం!" గుప్తా అడ్డు తగిలాడు.

"అని మీరు అనుకున్నారు. నేనూ అలాగే అనుకునేలా చేశారు!" టెంపో నవ్వుతూ అన్నాడు. "మీరు నలుగురూ గదిలో సమావేశం అవడానికి ముందే, టేబుల్ లైట్‌లో షార్ట్ సర్క్యూట్ ఏర్పాటుచేసి, అదిగో ఆ కిటికీ తెరల వెనక దాక్కున్నాడు తోడు దొంగ!"

"ఎవడు?"

"ఎవడో యీ నోరులేని, ప్రస్తుతం ప్రాణం లేని ఈ కానీ చెప్పింది! ఆ తోడుదొంగకి పాతనాణేలు సేకరించే హాబీవుంది. 'పాత నాణేల పాదుషా' అతను. 'నిన్న – నేడు –రేపు' దినపత్రిక ద్వారా అతనెవరో కనిపెట్టాను! అతను డైమండ్ చోరీలో పాల్గొన్నాడంటే – మీ నలుగురి మధ్యే నలుగుతూ వుండిపోయిన 'నేపాలీ వజ్రం' గురించి అతనికి తెలిసి వుండాలి! తెలిసి వుండాలంటే మీ నలుగురిలో ఎవరో ఒకరు చెప్పి వుండాలి..."

"ప్లీస్, మిస్టర్ టెంపో... ఎవడు వాడు!"

"అతను మీ డ్రైవర్ నరహరి!"

"మిస్టర్ టెంపో!"

"మీ నలుగురిలో ఎవరో అతనికి చెప్పి వుండాలి. నిన్న సాయంత్రం అతని సెల్‌ఫోన్‌కి మీ నలుగురిలో ఎవరినుంచీ కాల్స్ వచ్చాయో ఇన్స్‌పెక్టర్ పృథ్వీరావ్ సహాయంతో తెలుసుకున్నాను. అలాగే నరహరి చరిత్ర కూడా తెలుసుకున్నాను. మీ డ్రైవరుగా చేరే ముందు.."

"వాడు అగర్వాల్ దగ్గర పనిచేశాడు! రెండేళ్ళ క్రిందట అగర్వాల్ వాణ్ణి నాకు రికమెండ్ చేశాడు!" గుప్తా అన్నాడు.

"యస్! ఆ పాత పరిచయాన్ని అగర్వాల్. సమయానికి వుపయోగించు కున్నాడు. సెల్‌ఫోన్ ద్వారా నరహరికి వజ్రం గురించీ, మీ సమావేశం గురించీ చెప్పాడు. లైట్స్ ఆరిపోయేలా చేయమనీ, డైమండ్ కాజేసి, జారుకొమ్మనీ ప్లాన్ నూరిపోశాడు. నరహరి కిటికీ కర్టెన్స్‌చాటున దాక్కుని, లైట్లు ఆరిపోయేక డైమండ్ కాజేసి, బైటికి పారిపోయాడు! తరువాత వజ్రాన్ని తన గురువుకి అందచేశాడు!

"దొంగ ఎవరో తెలిసిపోయిందనీ, పోలీసులు అరెస్టు చేస్తారని నేను చెప్పేసరికి అగర్వాల్‌లో భయం ప్రారంభమైంది. నరహరిని అరెస్ట్ చేస్తే అతను తన గురించి చెప్పేస్తాడు! ఆ భయంతో నేను ఏర్పాటుచేసిన చీకట్లో వజ్రాన్ని యథాస్థానంలో పెట్టేశాడు అగర్వాల్. అతను కూచున్న కుర్చీ వజ్రం బాక్సుకి దగ్గర్లోనే వుంది! అతనికి బోలెడంత టైం ఇవ్వటం కోసం అగ్గిపెట్టె తెరుస్తూ పుల్లల్ని కింద పడేలా చేసి ఏరుకున్నాను!"

"దుర్మార్గుడు! నమ్మక ద్రోహి!" గుప్తా కోపంతో అన్నాడు.

"సో... ఈ కానీ ఆధారంతో నరహరినీ, అతని ద్వారా అగర్వాల్‌నీ పట్టుకున్నాను! నిన్న మీ డ్రైవర్‌ని చూడగానే ఆ ముఖాన్ని ఎక్కడో చూసి నట్టనిపించింది! 'నిన్న–నేడు–రేపు' దినపత్రిక ఆదివారం అనుబంధంలో చూశాను!"

"కంగ్రాట్స్!" గుప్తా లేచి చెయ్యి కలుపుతూ అన్నాడు.

"దొంగ దొరికాడు; దొంగసొత్తూ దొరికింది! దొంగను – ఇంటి దొంగను ఏం చేసుకుంటారో మీ ఇష్టం..." టెంపో సిగరెట్టు ముట్టిస్తూ అన్నాడు.

"ఏం చేస్తాం! కంపెనీ నుండి వెలివేస్తాం, దొంగ వెధవని!" గుప్తా కసిగా అన్నాడు.

"గుడ్! మీ డ్రైవర్ని పిలవండి! అతని 'కానీ' అతనికే ఇచ్చేద్దాం!" టెంపో నాణేన్ని పైకి ఎగజిమ్మి పట్టుకుంటూ అన్నాడు.

"లింగయ్యా!" గుప్తా బిగ్గరగా పిలిచాడు.

లింగయ్య గుమ్మంలో ప్రత్యక్షమయ్యాడు.

"డ్రైవర్ని రమ్మను! అర్జెంట్!" గుప్తా ఆజ్ఞాపించాడు.

"పని మానేస్తున్నానని చెప్పి కారు తాళం చెవి యిచ్చేసి వెళ్ళి పోయాడయ్యా!" తాళం చెవి చూపిస్తూ అన్నాడు లింగయ్య.

గుప్తా ఆశ్చర్యంగా నోరు తెరిచాడు.

డిటెక్టివ్ టెంపో పగలబడి నవ్వుతూ వుండిపోయాడు.

*